సాక్షి
హనుమకొండ
శుక్రవారం | 11 | ఆగస్టు | 2023

న్యూస్‌రీల్

మైక్రో బయాలజీ విభాగాధిపతిగా వెంకటయ్య


రాజేందర్


పి.వెంకటయ్య

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ మైక్రోబయాలజీ విభాగాధిపతిగా ఆవిభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.వెంకటయ్యను నియమిస్తూ కేయూ రిజిస్ట్రార్ ఆచార్య టి.శ్రీనివాస్‌రావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈపదవిలో ఆయన రెండేళ్లపాటు ఉండనున్నారు. కేయూ సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల (ఎస్‌ఎఫ్‌సీ) డైరెక్టర్‌గా కామర్స్‌అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల డైరెక్టర్‌గా ఆచార్య కట్ల రాజేందర్ నియమితులయ్యారు. ఈమేరకు కేయూ రిజిస్ట్రార్ ఆచార్య టి.శ్రీనివాస్‌రావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏడాది పాటు ఆయన పదవిలో ఉంటారు.

14న ఐటీఐలో అప్రెంటిస్‌షిప్ మేళా

వరంగల్: జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళాలో భాగంగా ఈనెల 14వ తేదీన ములుగురోడ్డు సమీపంలోని వరంగల్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో అప్రెంటిషిప్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జుమ్లానాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేళాను ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులు వినియోగించుకోవాలని కోరారు. అభ్యర్థులు ముందుగా www.apprenticeshipindia.gov.in పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. హైదరాబాద్‌కు చెందిన పరిశ్రమల ప్రతినిధులు ఈమేళాలో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

ఉద్యోగుల తరఫున కృతజ్ఞతలు



హన్మకొండ అర్బన్: త్వరలోనే ఉద్యోగ సంఘాల నేతలను పిలిచి సమస్యలు పరిష్కరిస్తామని సీఎం కేసీఆర్ అసెంబ్లీలో తెలపడం, ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయడంపై ఉద్యోగుల పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు టీఎన్జీఓస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ అన్నారు. గురువారం టీఎన్జీఓస్ భవన్‌లో జరిగిన జిల్లా యూనియన్ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. టీఎన్జీఓస్ కేంద్ర సంఘం చొరవతో ప్రభుత్వం జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్న 1266 కారుణ్య నియామకాలను రెండు వారాల్లోపు భర్తీ చేయాల్సిందిగా ఆదేశాలివ్వడంతో ఆయా కుటుంబాల్లో వెలుగులు నిండాయన్నారు. యూనియన్ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టీఎన్జీఓస్ జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి పనికల రాజేష్, కేంద్ర సంఘం నాయకులు శ్యాంసుందర్, కత్తి రమేష్, రామునాయక్, లక్ష్మీప్రసాద్, జిల్లా నాయకులు సలీం, చీకటి శ్రీనివాస్, రాజేశ్‌ఖన్నా, రాజ్యలక్ష్మి, రాజమౌళి, భరత్, ప్రణయ్, రాజీవ్, పృథ్వీ, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులపై అవగాహన కల్పించాలి



కాజీపేట అర్బన్: వైన్స్ టెండర్లలో పాల్గొనే వారికి దరఖాస్తులపై పూర్తి అవగాహన కల్పించి స్వీకరించాలని ఎక్సైజ్ శాఖ జాయింట్ కమిషనర్, జిల్లా స్టేషన్ ఆఫీసర్ సురేశ్‌రాథోడ్ తెలిపారు. హనుమకొండ కలెక్టరేట్‌లో వైన్స్ షాపుల దరఖాస్తుల స్వీకరణను జేసీ సురేశ్ రాథోడ్ గురువారం పరిశీలించారు. ఈనెల 18న దరఖాస్తులకు చివరిరోజు కావడంతో అధిక మొత్తంలో దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని, తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, సీఐలు ఎల్.రామకృష్ణ, అంజిత్‌రావు, చంద్రమోహన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

7 రోజులు 112 దరఖాస్తులు..

ఈనెల 4 నుంచి గురువారం ఏడు రోజుల్లో వరంగల్ అర్బన్ జిల్లా ఎక్సైజ్ పరిధిలో 112 దరఖాస్తులు అందజేశారు. గురువారం వరంగల్ అర్బన్ 28, ఖిలావరంగల్ 12, హనుమకొండ 10, కాజీపేట 10 దరఖాస్తులు రాగా.. ఏడు రోజుల్లో వరంగల్ అర్బన్ 50, ఖిలావరంగల్ 26, హనుమకొండ 20, కాజీపేట 16 దరఖాస్తులతో 112 దరఖాస్తులు ఎక్సైజ్ అధికారులు స్వీకరించారు.

కులవృత్తులను కాపాడుకునేందుకే బీసీ బంధు


లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

పరకాల: కనుమరుగవుతున్న కులవృత్తులను కాపాడుకునేందుకే బీసీ బంధు పేరిట తెలంగాణ ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోందని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. ఆర్థిక సాయం అందుకున్న లబ్ధిదారులు వృత్తిపరంగా ఆర్థికంగా బలోపేతం కావాలని కోరారు. పరకాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణలో పరకాల నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన 300 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం అందించే రూ.1లక్ష చెక్కులను గురువారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ దేశాలకు తెలంగాణ సంక్షేమ పథకాలు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రావడానికి ప్రజలకు మాయమాటలు చెప్పి మోసం చేయాలని చూస్తోందన్నారు. కార్యక్రమంలో పరకాల మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బండి సారంగపాణి పరకాల, నడికూడ జెడ్పీటీసీలు సిలువేరు మొగిళి, కోడెపాక సుమలత, నడికూడ ఎంపీపీ ధనసూరి అనసూర్య, పరకాల వైస్ ఎంపీపీ చింతిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, మాదారం పీఏసీఎస్ చైర్మన్ నల్లెల లింగమూర్తి, కమిషనర్ టి.శేషాంజన్‌స్వామి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

గృహలక్ష్మికి దరఖాస్తుల వెల్లువ




కలెక్టరేట్‌లో బారులుదీరిన దరఖాస్తుదారులు

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గృహలక్ష్మి పథకానికి హనుమకొండ జిల్లాలో దరఖాస్తులు వెల్లువలా వచ్చాయి. సొంత స్థలం కలిగి ఉండి ఇల్లు కట్టుకునేందుకు ప్రభుత్వం రూ.3 లక్షల ఆర్థిక సాయాన్ని అందించనుంది. ఇందుకోసం దరఖాస్తులు స్వీకరించింది. గురువారంతో స్వీకరణ గడువు కూడా ముగిసింది. చివరి రోజు హనుమకొండ కలెక్టరేట్‌కు జిల్లాప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి దరఖాస్తులు సమర్పించారు.

- సాక్షిఫొటోగ్రాఫర్, హనుమకొండ

రచ్చకెక్కిన ఎన్నికల బదిలీలు!

రెవెన్యూ, పోలీస్‌శాఖల్లో వివాదంగా పోస్టింగ్‌లు

- ఎన్నికల బదిలీల్లోనూ ప్రజాప్రతినిధుల లేఖలు, జోక్యం
- డీజీపీ, సీఎస్, ఎన్నికల సంఘం వరకు ఫిర్యాదులు
- ప్రజాప్రతినిధుల సిఫారసులు, పోస్టింగ్‌లపై ఆరా...
- వివాదాస్పద పోస్టింగ్‌లపై రంగంలోకి ఇంటెలిజెన్స్?



సాక్షిప్రతినిధి, వరంగల్:

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఇటీవల జరిగిన బదిలీలు, నియామకాల ప్రక్రియలో కొందరు ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలు, ఒత్తిళ్ల వ్యవహారం వివాదాస్పదంగా మారింది. ప్రధానంగా పోలీస్, రెవెన్యూశాఖల్లో పలువురు బదిలీలు, పోస్టింగ్‌లపై ఆ శాఖల్లోనే చర్చ జరుగుతోంది. చినికి చినికి గాలివానగా మారిన ఈ బదిలీల వివాదం హైదరాబాద్ వరకు వెళ్లింది. ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ నుంచి కూడా డీజీపీ, చీఫ్ సెక్రటరీ, కేంద్ర ఎన్నికల సంఘం వరకు వెళ్లిన ఫిర్యాదులపై కేంద్ర, రాష్ట్ర నిఘావర్గాలు రంగంలోకి దిగాయి. ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బదిలీలు, నియామకాలు పారదర్శకంగా జరగాలన్న ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పక్కన పెట్టి మంత్రులు, ఎమ్మెల్యేల సిఫారసు లేఖలకు ప్రాధాన్యత ఇచ్చారన్న ఫిర్యాదుల నేపథ్యంలో ఇంటెలిజెన్స్ వర్గాలు ఆరా తీస్తుండటం ఆ రెండు శాఖల్లో చర్చనీయాంశంగా మారింది.

కలకలం రేపుతున్న ఫిర్యాదులు...

ఎస్‌ఐ నుంచి డీఎస్పీ స్థాయి పోలీస్ అధికారులు బదిలీల కోసం మంత్రులు, ఎమ్మెల్యేలను ఆశ్రయిస్తున్నారని, ఎమ్మెల్యే సిఫార్సు లేఖ ఉంటే తప్ప 'సమర్థత'పై అధికారులకు పోస్టింగ్‌లు దక్కడం లేదని, కొందరు ఎమ్మెల్యేల లేఖకు ఓ రేటు ఉందంటూ వచ్చిన కథనాల క్లిప్పింగ్‌ల ఆధారంగా చేసిన ఈ ఫిర్యాదులు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఇటీవల జరిగిన పోలీస్, రెవెన్యూశాఖల బదిలీల్లో తాము లేఖలు ఇచ్చిన వారికే పోస్టింగులు ఇచ్చేలా చక్రం తిప్పిన ఘటనలు.. ప్రజాప్రతినిధులు తమకు అనుకూలమైన వారినే తెచ్చుకుంటున్నారనే ఆరోపణలు ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో వాటిపై ఇంటెలిజెన్స్ ఆరా తీస్తుండడం ఆయా శాఖలను కుదిపేస్తోంది.

వివాదంగా మారిన బదిలీలు... మచ్చుకు కొన్ని...

- హనుమకొండ జిల్లాలో కీలకమైన డివిజన్‌కు ఆర్డీఓగా రెండున్నర ఏళ్లకుపైగా పనిచేసిన ఓ అధికారిని ఎన్నికల సంఘం నిబంధనల పరిధిలోకి వస్తారని మొదట హైదరాబాద్‌కు బదిలీ చేశారు. హనుమకొండ, వరంగల్ జిల్లాలు గ్రేటర్ వరంగల్ పరిధిలోకి వస్తాయి కూడా. ఈ నేపథ్యంలోనే ఆయనను హైదరాబాద్‌కు బదిలీ చేసినట్లు పేర్కొన్నారు. ఐదారు రోజులకే ఆయనను వరంగల్ జిల్లాలో ఆర్డీఓగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీని వెనుక ఓ కీలక ప్రజాప్రతినిధితోపాటు మరో ఇద్దరు నియోజకవర్గస్థాయి నాయకుల సిఫారసు లేఖలు ఉన్నట్లు రెవెన్యూశాఖలో చర్చ జరుగుతోంది.
- మహబూబాబాద్ జిల్లా తొర్రూరు డీఎస్పీ పోస్టింగ్‌పై కన్నేసిన ఓ అధికారి ఆదిలాబాద్ జిల్లా నుంచి వరంగల్ కమిషరేట్‌కు వచ్చారు. తొర్రూరు డీఎస్పీ పదవీకాలం పూర్తికాకముందే ఓ కీలక ప్రజాప్రతినిధి (మంత్రి), ఓ ఎమ్మెల్యే సిఫారసు లేఖలతో ఆ అధికారికి డీఎస్పీగా పోస్టింగ్ ఇచ్చారు. రెండు, మూడు రోజులకే తిరిగి ఆ పోస్టింగ్‌ను రద్దు చేసి చీఫ్ ఆఫీసుకు బదిలీ చేస్తూ మళ్లీ పాత డీఎస్పీకే పోస్టింగ్ ఇవ్వగా, ఆయన అందుకు ససేమిరా అనడంతో జి.వెంకటేశ్వరరావును డీఎస్పీగా నియమించారు. తొర్రూరుకు తీవ్రంగా ప్రయత్నం చేసిన ఆ ఆదిలాబాద్ డీఎస్పీ అదే కీలక ప్రజాప్రతినిధిని ఒప్పించి వరంగల్ జిల్లాలోని ఓ నియోజకవర్గ కేంద్రంలో పోస్టింగ్ కొట్టడం పోలీస్‌శాఖలో చర్చగా మారింది.
- కమిషనరేట్ పరిధిలో గత నెల 31 వరకు జరిగిన పలువురి బదిలీలు సిఫారసు లేఖలతోనే చేసినట్లు చర్చ ఆ శాఖలోనే సాగుతోంది. గతంలో కమిషనరేట్ పరిధిలో పనిచేసిన పలువురు ఇన్‌స్పెక్టర్లు తిరిగి ఇక్కడికే వచ్చేందుకు నేతలను ప్రసన్నం చేసుకున్నారన్న చర్చ అధికారుల్లోనే ఉంది. వరంగల్ సబ్ డివిజన్ పరిధిలోని ఓ సిటీ సెంటర్ పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్‌గా రెండేళ్లు పూర్తయినప్పటికి అదే సబ్ డివిజన్ పరిధిలో 'గంజ్'లో పోస్టింగ్ కొట్టారు. అక్కడ రెండేళ్లకు పైగా ఉన్న మరో ఇన్‌స్పెక్టర్ గతంలో పరకాల సబ్ డివిజన్‌లో ఎస్సై, సీఐగా పనిచేసినా... తిరిగి అదే సబ్ డివిజన్ పరిధిలోని రూరల్ ఏరియా స్టేషన్ సీఐగా పోస్టింగ్ సాధించారు.
- హనుమకొండ జిల్లాకు చెందిన చాలామంది తహసీల్దార్లు పొరుగు జిల్లా అయిన వరంగల్‌కు బదిలీ అయ్యారు. పలు నియోజకవర్గాలు రెండు జిల్లాల్లో ఉన్నాయి. ఈ క్రమంలో ఇప్పటివరకు ఒక జిల్లాలో పనిచేసిన ఇద్దరు తహసీల్దార్లు ఇప్పుడు వరంగల్‌కు బదిలీ అయినా పాత నియోజకవర్గంలోకే మళ్లీ వచ్చారు.
- తహసీల్దార్ల బదిలీల సందర్భంగా హనుమకొండ జిల్లాకు చెందిన వారు ఇతర జిల్లాలకు.. ఇతర జిల్లాల నుంచి ఇక్కడికి కొందరు వచ్చారు. ఇదే క్రమంలో వచ్చిన ఓ తహసీల్దార్‌ను వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని ఓ మండలంలో నియమించారు. ఇది నచ్చని ఓ జిల్లాస్థాయి ప్రజాప్రతినిధి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా సదరు తహసీల్దార్ సెలవులో వెళ్లారు. ఈ సీటుపై కన్నేసిన మరో తహసీల్దారు సదరు పోస్టింగ్‌ను జిల్లా ప్రజాప్రతినిధి ద్వారా కొట్టేయగా.. సెలవులో వెళ్లిన మహిళా తహసీల్దార్‌ను పరకాల రెవెన్యూ డివిజన్‌లోని ఓ మండలానికి మార్చారు.

టీపీయూఎస్ ఆధ్వర్యంలో మహా ధర్నా


ధర్నాలో టీపీయూఎస్ బాధ్యులు, ఉపాధ్యాయులు

విద్యారణ్యపురి: విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని హనుమకొండ, వరంగల్ జిల్లా శాఖల ఆధ్వర్యంలో గురువారం హనుమకొండలోని ఏకశిల పార్కు వద్ద మహా ధర్నా నిర్వహించారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని, పెండింగ్ డీఏలు, పీఆర్సీ ఎరియర్స్ బిల్లులు చెల్లించాలని నినాదాలు చేశారు. ఇందులో టీపీయూఎస్ రాష్ట్ర బాధ్యులు చిదురాల సుధాకర్ మాట్లాడుతూ.. దీర్ఘకాలికంగా పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యలపై స్పందించకపోతే ఈనెల 19న హైదరాబాద్‌లో ఇందిరా పార్కు వద్ద రాష్ట్ర స్థాయిలో ధర్నా చేపట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో టీపీయూఎస్ హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆముదాల దాత మహర్షి, బత్తిని వీరస్వామి, బత్తిని వెంకటరమణ, ఉప్పుల సతీశ్, బాధ్యులు పిన్నింటి బాలాజీరావు, ఆత్మకూరు దేవేంద్రచారి, మాచర్ల భిక్షపతి, సంగెం శ్రీనివాస్, వినదానందం, తిరుపతిరావు, మనోజ్‌కుమార్ రాంభూపాల్ రెండు జిల్లాల టీపీఎస్‌యూ బాధ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.. ఈమహాధర్నాకు కేయూ రిటైర్డ్ ఆచార్యులు కె.వెంకటనారాయణ, ఏబీవీ రాష్ట్ర సంఘటన కార్యదర్శి లవణ్‌కుమార్, బీఎంఎస్ జిల్లా కార్యదర్శి మచ్చరాజు సంఘీభావం తెలిపారు. ధర్నా అనంతరం ఉభయ జిల్లాల టీపీయూఎస్ బాధ్యులు హనుమకొండ అడిషనల్ కలెక్టర్ మహేందర్‌జీ, వరంగల్ అదనపు కలెక్టర్ కోట శ్రీవత్సకు వినతిపత్రాలు అందించారు.

19 వరకు దరఖాస్తుల స్వీకరణ

కాశోజీ సెంటర్ : మహేశ్వరంలోని రెసిడెన్షియల్ బ్రిడ్జి స్కూల్‌లో వాచ్‌మెన్లు, స్కావెంజర్ పోస్టుల తాత్కాలిక భర్తీకి ఈనెల 19వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు వరంగల్ డీఈఓ వాసంతి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు 10వ తరగతి పాస్ లేదా ఫెయిల్, 18 నుంచి 45 సంవత్సరాల లోపు వయస్సు గల పురుషులు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తుదారుడు కనీసం 5.6 అడుగుల ఎత్తు ఉండాలని తెలిపారు. ఆసక్తి గల వారు అర్హత పత్రాల జిరాక్స్ కాపీలను ఈనెల 19లోగా జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సమర్పించాలని వివరించారు.

నేడు వరంగల్ రూరల్ జెడ్పీ సమావేశం

వరంగల్ : వరంగల్ రూరల్ (వరంగల్) జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 10.30 గంటలకు హనుమకొండలోని జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు సీఈఓ రాంరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి జిల్లా పరిధిలోని ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు సకాలంలో హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

17న వరంగల్ అర్బన్ జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశం

హన్మకొండ: వరంగల్ అర్బన్ జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశం ఈ నెల 17న నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ వెంకటేశ్వర్ రావు తెలిపారు. హనుమకొండలోని జెడ్పీ కార్యాలయంలో జరిగే ఈ సమావేశాలకు సభ్యులు, ఆయా శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు. 17న ఉదయం10.30 గంటలకు 2, 3, 5, 6 స్థాయీ సంఘాలు, మధ్యాహ్నం 12 గంటలకు 4వ స్థాయీ సంఘం, 2.30 గంటలకు 7వ స్థాయీ సంఘం, 3.30 గంటలకు 1వ స్థాయీ సంఘం సమావేశం జరుగుతుందని వివరించారు.

అర్ధరాత్రి పత్రాల పంపిణీ

- వీఆర్‌ఏలకు బదలాయింపు పత్రాలు అందజేత
- సమాచారం తెలియగానే కార్యాలయానికి చేరుకున్న ఇస్సాదారులు


కార్యాలయం ముందు ఇస్సాదారుల ఆందోళన


ఇస్సాదారులను చూసి పారిపోతున్న కంప్యూటర్ ఆపరేటర్ నాగరాజు

పరకాల: వీఆర్‌ఏలను ఇతర శాఖలకు బదలాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులపై రాష్ట్ర హైకోర్టు స్టే విధించినప్పటికీ పరకాల తహసీల్దార్ అధికారులు వీఆర్ఏలకు బదిలీ పత్రాలు గురువారం రాత్రి 11 గంటలకు అందజేశారు. సమాచారం తెలియగానే పలువురు ఇస్సాదారులు (వారసత్వ వాటాదారులు) కార్యాలయం వద్దకు చేరుకున్నారు. గమనించిన డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ శివ, కంప్యూటర్ ఆపరేటర్ నాగరాజు తోపాటు అక్కడే ఉన్న వీఆర్‌ఏలంతా చేతికందిన బదిలీ పత్రాలను పట్టుకొని బయటకు పరుగులు పెట్టారు. దీంతో ఇస్సాదారులు ఆందోళనకు దిగారు. ఇస్సాదారుల సమస్య పరిష్కారం కాకుండా ప్రభుత్వం వీఆర్ఏలను ఇతర శాఖలకు బదలాయిస్తూ ఉత్తర్వులు జారీ చేయడాన్ని తప్పుపడుతూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన విషయాన్ని ధిక్కరించి పరకాల తహసీల్దార్ అధికారులు పత్రాలు జారీ చేయడమేంటని ప్రశ్నించారు. తమ జీవితాలను ప్రశ్నార్థకంగా మార్చవద్దని విజ్ఞప్తి చేశారు. సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ఇస్సాదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మాచబోయిన అశోక్, వీర్ల సమ్మయ్య, వీర్ల సురేశ్, బొజ్జం రాకేశ్, వీర్ల అజయ్ డిమాండ్ చేశారు.

నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తా..

ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఎల్కతుర్తి: గౌరవెల్లి ప్రాజెక్టును గోదావరి జలాలతో నింపి హుస్నాబాద్ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తానని హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్ కుమార్ స్పష్టం చేశారు. గురువారం భీమదేవరపల్లి మండలం ముల్కనూరులోని వెంకటసాయి గార్డెన్‌లో బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రతిపక్ష పార్టీలు ఎన్ని అడ్డంకులు సృష్టించినా.. ఇచ్చిన మాట ప్రకారం గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేశానన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల సమస్యలు పరిష్కరిస్తానని చెప్పారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే మండిపడ్డారు. హుస్నాబాద్ గడ్డమీద మూడోసారి కూడా బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ఏర్పడక ముందు ఈ ప్రాంతం ఎలా ఉండేదో ప్రజలకు తెలుసన్నారు. కరెంట్ ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలిసేది కాదన్నారు. దేవాదుల, కాకతీయ కాలువ, గౌరవెల్లి ప్రాజెక్టుతో పంట భూముల సస్యశ్యామలం, 18 విద్యుత్ సబ్‌స్టేషన్లను నెలకొల్పి రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించనున్నట్లు ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి ప్రజలకు వివరించి, గ్రామగ్రామాన సమీక్ష సమావేశాలు పెట్టి ప్రజలను చైతన్యపర్చాలని సూచించారు. పార్టీ మండల అధ్యక్షుడు మారుపాటి మహేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో జెడ్పీ చైర్మన్ మారేపల్లి సుధీర్‌కుమార్, ఎంపీపీ జక్కుల అనిత రమేష్, జెడ్పీటీసీ వంగ రవీందర్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాల పరిరక్షణకు పోరాటాలు


మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట భిక్షపతి

హన్మకొండ అర్బన్: కార్మిక చట్టాల పరిరక్షణకు సమరశీల పోరాటాలు నిర్వహించాలని కార్మిక సంఘాల నాయకులు తోట భిక్షపతి, ప్రభాకర్‌రెడ్డి, నాయిని రవి, అప్పారావు అన్నారు. కార్మిక వ్యతిరేక విధానాల్ని నిరసిస్తూ జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు గురువారం రెండో రోజు కలెక్టరేట్ కార్యాలయం ఎదుట కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రజా సమస్యలను, కార్మిక వర్గ సమస్యలను గాలికి వదిలి కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తోందన్నారు. 73 శాతం సంపద ఒక్క శాతం ఉన్న సంపన్నుల వద్ద కేంద్రీకృతమైందన్నారు. దీని వల్ల నిరుద్యోగం, కనీస వేతనం, గిట్టుబాటు ధర, దారిద్య్రం, వలస వంటి సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. ఎన్నో పోరాటాల, త్యాగాల ఫలితంగా ఏర్పడ్డ ఎనిమిది గంటల పని విధానాన్ని అవహేళన చేసేలా కేంద్ర ప్రభుత్వం బీజేపీ పాలిత రాష్ట్రాల్లో 12 గంటల పని విధానాన్ని అమలు చేస్తోందన్నారు. కార్మిక చట్టాల పరిరక్షణకు, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడేందుకు బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా జరిగిన క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు జక్కు రాజుగౌడ్, మద్దెల ఎల్లేశ్, దుర్గుల రామ్మూర్తి, మంచాల తిరుపతి, శంకర్, వేల్పుల సారంగపాణి, సంపత్, రవి, నాయిని రవి, ప్రణయ్, తదితరులు పాల్గొన్నారు.

బిల్డింగ్ పర్మిషన్ల బాధ్యత టౌన్ ప్లానింగ్‌దే

వరంగల్ అర్బన్: టీఎస్–బీపాస్ ద్వారా జారీ అవుతున్న భవన నిర్మాణ అనుమతులు దారి తప్పుతుండడంతో ఉన్నతాధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. నూతన భవన నిర్మాణ ధ్రువీకరణ పత్రాల జారీలో నీటి పారుదల శాఖ, పంచాయతీ రాజ్, రోడ్లు భవనాల శాఖ అధికారులను తప్పిస్తూ రాష్ట్ర టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ ఉన్నతాధికారులు తాజాగా జీఓ ఉత్తర్వులు జారీ చేశారు. ఇతర శాఖలకు చెందిన అధికారులు తీసుకుంటున్న నిర్ణయాల వల్ల బల్దియా టౌన్ ప్లానింగ్ అధికారులకు పెద్ద తలనొప్పులు ఎదురవుతున్నాయి. చెరువులు, కుంటల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో వెరిఫికేషన్ బృందాలైన ఆయా శాఖల ఏఈఈలు నిబంధనలు పాటించట్లేదని, ధ్రువీకరణ జారీలో చేతివాటం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. టౌన్ ప్లానింగ్ సిబ్బంది, అధికారులకు, పోస్ట్ వెరిఫికేషన్ బృందాల మధ్య సమన్వయం లోపిస్తోంది. నగరాల్లో, పట్టణాల్లో ఇతర శాఖల అధికారుల పాత్ర లేదు. వరంగల్ బల్దియాలో మాత్రమే గత రెండున్నరేళ్ల కింద నియమించారు. ఈనేపథ్యంలో.. ప్రభుత్వం దృష్టికి పలుమార్లు ఫిర్యాదులు రావడంతో.. రాష్ట్ర పురపాలక శాఖ ఉన్నతాధికారులు, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్ నిర్ణయం తీసుకున్నారు. ఇక టీఎస్–బీపాస్ పోర్టల్ ద్వారా వచ్చే బిల్డింగ్ పర్మిషన్ల అప్లికేషన్లను ర్యాండమేషన్ సిస్టమ్ ప్రకారం.. బల్దియా టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బందితోపాటు డిప్యూటీ కమిషనర్లు స్థలాల పరిశీలన, దస్తావేజుల పరిశీలన, సాంకేతిక అనుమతులు పరిశీలన అన్నీ పూర్తి చేసి పర్మిషన్లు జారీ చేయనున్నారు.

క్లుప్తంగా

ఇఫ్కో నానో యూరియాతో అధిక దిగుబడి

నయీంనగర్: ఇఫ్కో నానో యూరియా, నానో డీఏపీతో పంటలకు అధిక దిగుబడి వస్తుందని ఇఫ్కో స్టేట్ మార్కెటింగ్ మేనేజర్ ఆర్.కృపాశంకర్ తెలిపారు. గురువారం హన్మకొండ నయీంనగర్ ప్రెసిడెంట్ దాబాలో ఇఫ్కో వరంగల్ జిల్లా మేనేజర్ విశాల్‌షిండే అధ్యక్షతన నానో యూరియా, డీఏపీపై డీలర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎరువుల ప్రత్యేకతలను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు డి.ఉషాదయాళ్, బి.రవీందర్‌సింగ్, బి.చత్రునాయక్, ఎం.విజయభాస్కర్, కేఏ.గౌస్‌హైదర్, శాస్త్రవేత్తలు గోపీనాథ్, హన్మకొండ ఏడీఏ కె.దామోదర్‌రెడ్డి, ఎంఏఓ విజ్ఞాన్, ఓడీసీఎంఎస్ వరంగల్ బిజినెస్ మేనేజర్ కీరునాయక్, మార్క్‌ఫెడ్ మేనేజర్లు శ్యాంకుమార్, మహేష్‌కుమార్ పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్‌లపై సమావేశం..

కరీమాబాద్: వరంగల్ జిల్లా పరిషత్ కార్యాలయంలో గురువారం సాయంత్రం నర్సంపేట నియోజకవర్గంలోని ఆరు మండలాలు, పాలకుర్తి నియోజకవర్గంలోని రాయపర్తి మండలానికి సంబంధించిన సమస్యాత్మక పోలింగ్ స్టేషన్‌లను గుర్తించేందుకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో సెక్టార్, పోలీస్ అధికారుల పాత్ర కీలకమని, ప్రతీ పోలింగ్ స్టేషన్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు.

13న చెస్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్: వరంగల్‌లోని చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో ఈనెల 13వ తేదీన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు టోర్నమెంట్ నిర్వహణ కార్యదర్శి కన్నా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అండర్-07, 11 విభాగాల్లో బాల బాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తామన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన నలుగురు క్రీడాకారులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తామని ఆయన వివరించారు. అండర్-7 కేటగిరీలో ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని, అండర్-11 కేటగిరీలో ఈనెల 27 నుంచి 29 వ తేదీ ఖమ్మంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కాగా, పోటీలకు అండర్-7 కేటగిరీలో జనవరి-01, 2016 తర్వాత జన్మించిన వార్మై, అండర్-11 విభాగంలో జనవరి-01 2012 తర్వాత జన్మించిన వారు అర్హులు అన్నారు. వివరాలకు 90595 22986 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్ష

దోర్నకల్: బాలికపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడికి మహబూబాబాద్ జిల్లా కోర్టు 20 సంవత్సరాల జైలు శిక్ష విధించింది. దోర్నకల్ సీఐ ఉపేందర్‌రావు కథనం ప్రకారం మండలంలోని చిలుకోడు గ్రామానికి చెందిన బాలికపై 2022 సెప్టెంబర్ 5న బయ్యారం మండలం కంబాలపల్లికి చెందిన కత్తుల వాసు లైంగికదాడికి పాల్పడ్డాడు. దీనిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని సెప్టెంబర్ 10న నిందితుడు వాసును అరెస్ట్ చేశారు. అదే రోజు ఫస్ట్‌క్లాస్ అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. కేసును అప్పటి సీఐ వెంకటరత్నం విచారణ జరపగా ప్రస్తుత సీఐ బి.ఉపేందర్‌రావు కోర్టులో ఆధారాలు ప్రవేశపెట్టారు. గురువారం సాక్ష్యాధారాలను పరిశీలించిన మహబూబాబాద్ జిల్లా కోర్టు జడ్జి పి.చంద్రశేఖరప్రసాద్ నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్ష, రూ.5 వేల జరిమానా విధించారు. కాగా, పీపీ కె.పద్మాకర్ రెడ్డి కేసును వాదించారు.

పసుపు, పల్లియార్డుల్లో జీరో దందా?

- వచ్చిన బస్తాల్లో సగానికి పైగా మార్కెట్ ఫీజు మినహాయింపు
- దృష్టి సారించని అధికార యంత్రాంగం


మార్కెట్‌లో యార్డులో గుట్టగా పోసిన పసుపు రాశులు

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లోని పసుపు, పల్లి యార్డుల్లో కొన్ని రోజులుగా గుట్టుగా జీరో దందా నడుస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ప్రస్తుత సీజన్‌లో పసుపు ధర అమాంతం పెరగడంతో వ్యాపారులు, మార్కెట్ సిబ్బంది కుమ్మక్కై ఈ వ్యవహారానికి పాల్పడుతున్నట్లు తెలిసింది. పసుపు ప్రస్తుతం క్వింటాల్‌కు రూ.11 నుంచి రూ.13 వేల వరకు పలుకుతోంది. అంటే ప్రతి క్వింటాకు కొనుగోలుదారుడు రూ.130 మార్కెట్ ఫీజు కమిటీకి చెల్లించాల్సి ఉంది. ప్రస్తుతం మార్కెట్‌కు వస్తున్న పసుపు, పల్లి బస్తాల్లో సగానికి పైగా జీరో చేస్తూ మిగిలిన బస్తాలకు మార్కెట్ ఫీజు చెల్లిస్తున్నట్లు తెలిసింది. ప్రతి రైతు దాదాపు అడ్తిదారుల వద్ద అప్పుగా తీసుకుని పంటలను సాగు చేస్తారు. అలాగే, పంట ఉత్పత్తులను మార్కెట్‌లో అదే అడ్తిదారుడికే విక్రయించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో వ్యాపారులు ముందు యార్డు బాధ్యులతో మాట్లాడుకుని సరుకు తీసుకురమ్మని రైతులకు చెబుతారు. ఈ రోజే మార్కెట్‌కు రైతులు సరుకు తీసుకురావడంతో ఈవ్యవహారం బయట పడడం లేదని తెలిసింది. గురువారం మార్కెట్‌లోని పసుపు యార్డుకు వచ్చిన సరుకు, అధికారులకు అందించిన నివేదికల్లో నమోదు చేసిన వివరాలు తేడా ఉన్నట్లు తెలుస్తోంది. పసుపు, పల్లి ధరలు గరిష్టంగా నమోదు కావడం.. ఎలాంటి సమస్యలు లేకపోవడం.. రైతుల నుంచి ఫిర్యాదులు లేకపోవడంతో మార్కెట్ అధికారులు ఈవ్యవహారంపై పెద్దగా దృష్టిసారించడం లేదు.

దృష్టి సారిస్తాం...

పసుపు, పల్లి కొనుగోళ్లలో జీరో దందా జరిగే అవకాశం లేదు. ఈ ఏడాది పసుపు పంట తక్కువగా సాగు చేయడంతో ధరలు అనూహ్యంగా పెరిగాయి. అందుకే మార్కెట్ ఫీజు కూడా పెరుగుతోంది. జీరో దందా ఆరోపణలపై దృష్టి సారిస్తాం.

-బీవీ.రాహుల్, మార్కెట్ కార్యదర్శి

వరద బాధితులకు అండగా..


కొండాయిలో సరుకులు అందజేస్తున్న ఏఎస్పీ సంకీర్త్, జాన్సన్

ఏటూరునాగారం: ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని వరద బాధిత గ్రామాల్లోని కొండాయికి చెందిన 171 కుటుంబాలకు, మల్యాలలోని 42 కుటుంబాలకు, దొడ్లలోని 19 కుటుంబాలకు తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం (టీఆర్‌వీకేఎస్) ఆధ్వర్యంలో రూ.20లక్షలు విలువ చేసే 26 రకాల నిత్యావసర సరుకులను గురువారం అందజేశారు. ఏటూరునాగారం ఏఎస్పీ సంకీర్త్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొని వరద బా ఈటతులకు నిత్యావసర కిట్లను పంపిణీ చేశారు. అనంతరం టీఆర్‌వీకేఎస్ హెచ్ 58 విద్యుత్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేవీ జాన్సన్ మాట్లాడుతూ.. తమ సంఘంలోని ఉద్యోగలంతా కలిసి వరద బాధితులకు కావాల్సిన దుస్తులు, నిత్యావసర వస్తువులు ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూటీయూ రాష్ట్ర అధ్యక్షుడు పాదెం కృష్ణప్రసాద్, జీసీసీ డైరెక్టర్ పుల్సం పురుషోత్తం, ట్రాన్స్‌కో అధ్యక్షుడు మాడా దేవేందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వేణుగోపాల్, రవి, బండారి ప్రభాకర్, రాజగోపాల్, హరిప్రసాద్, రమణ, అక్రమొద్దీన్, కిరణ్, అక్బర్, వెంకన్న, నరేందర్, రమేష్, వెంకట్, నగేష్, రవీందర్, మహేందర్ రెడ్డి, పెసా మోబిలైజర్ రాకేష్, డివిజన్ ఉద్యోగులు పాల్గొన్నారు.

సరుకుల వాహనాలు ప్రారంభించిన సీఎండీ

హన్మకొండ: హనుమకొండనుంచి వరద ప్రాంతాలకు నిత్యావసర సరుకులతో వెళ్తున్న వాహనాలను సీఎండీ గోపాల్ రావు ప్రారంభించారు. వరద బాధితులను ఆదుకునేందుకు ముందుకు వచ్చిన తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం (టీఆర్‌వీకేఎస్) సేవలు అభినందనీయమని సీఎండీ కొనియాడారు.

తపాలా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి


మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

హన్మకొండ: గ్రామీణ తపాలా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని ఆల్ ఇండియా గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం హనుమకొండ డివిజన్ కార్యదర్శి బి. వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గురువారం హనుమకొండలోని తపాలా డివిజన్ కార్యాలయం ఎదుట తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉద్యోగులు ధర్నా చేశారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తపాలా ఉద్యోగుల పట్ల కేంద్రం ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని మండిపడ్డారు. ఇప్పటికైన తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నాయకులు కొమురారెడ్డి, ఎల్లయ్య, మనోహర్, తిరుపతి, వెంకటేష్ పాల్గొన్నారు.

నిజాయితీగా వ్యాపారం చేయాలి


మాట్లాడుతున్న సీపీ రంగనాథ్

- పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్

వరంగల్ క్రైం: 'నిజాయితీగా వ్యాపారం చేయాలి. లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం' అని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్ పాత ఇనుప సామగ్రి కొనుగోలు వ్యాపారులు, ఆటో కన్సల్టెన్సీ యాజమానులకు సూచించారు. కమిషనరేట్ పరిధిలో వాహనచోరీల నియంత్రణకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ట్రై సిటీ పరిధి పాత సామగ్రి కొనుగోలు వ్యాపారస్తులు, ఆటో కన్సల్టెన్సీ నిర్వాహకులతో గురువారం భీమారంలోని శుభం గార్డెన్స్‌లో సీపీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా సీపీ రంగనాథ్ మాట్లాడుతూ.. చోరీకి గురైన వాహనాలు కొనొద్దన్నారు. వ్యాపారస్తులు చట్ట వ్యతిరేకంగా చోరీ వాహనాలు కొంటే.. పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో క్రైం డీసీపీ మురళీధర్, ఏసీపీలు మల్లయ్య, రమేశ్‌కుమార్, కిరణ్‌కుమార్, డేవిడ్ రాజు, సతీశ్ బాబు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

ఒరిజినల్ పత్రాలు తప్పనిసరి

వాహనదారులు ప్రయాణించేటప్పుడు వాహనాలకు సంబంధించిన ఒరిజినల్ ధ్రువపత్రాలు తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని సీపీ ఏవీ.రంగనాథ్ ప్రజలకు సూచించారు. ఒరిజినల్ పత్రాలు వెంట తెచ్చుకోవడంలో ఇబ్బంది ఉంటే.. తెలంగాణ ట్రాన్స్‌పోర్ట్ విభాగానికి చెందిన యం-వాలెట్ యాప్‌లో చూపించినా సరిపోతుందని వివరించారు.

వాహనాల తనిఖీలో సీపీ

హసన్‌పర్తి: వాహనదారుడు ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలని నగర పోలీస్ కమిషనర్ రంగనాథ్ సూచించారు. పోలీసులు చేపడుతున్న వాహనాల తనిఖీలను సీపీ రంగనాథ్ గురువారం పరిశీలించి తనిఖీల్లో పాల్గొన్నారు. హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ పరిధి బాహుపేట క్రాస్, కేయూసీ పోలీస్‌స్టేషన్ పరిధి యాదవనగర్ ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తనిఖీల్లో క్రైం డీసీపీ మురళీధర్, హసన్‌పర్తి, కేయూసీ ఇన్‌స్పెక్టర్‌లు గోపీ, అబ్బయ్య, ఎస్సైలు సురేశ్, రాజ్‌కుమార్, విజయ్‌కుమార్, వలీ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర వేడుకలకు ఏర్పాట్లు చేయాలి

- జిల్లాస్థాయి అధికారుల సమీక్షలో వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య


స్వాతంత్య్ర దినోత్సవ ఏర్పాట్లపై సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

కరీమాబాద్: జిల్లాలో స్వాతంత్య్ర వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో స్వాతంత్య్ర వేడుకల నిర్వహణ కోసం అధికారులతో కలెక్టర్ గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ వరంగల్ ఐడీటీసీ నిర్మాణ స్థలంలో జరుగనున్న వేడుకలకు పోలీసు శాఖ ఏర్పాట్లు చేయాలని సూచించారు. దేశభక్తి గీతాలపై సాంస్కృతిక ప్రదర్శనలు ఉండాలని డీఈఓ, డీపీఆర్వోకు సూచించారు. వేడుకలకు వచ్చే ముఖ్య అతిథికి జిల్లా ప్రగతికి సంబంధించిన సందేశాన్ని తయారు చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీవత్స, డీసీపీ రవీందర్, ఆర్డీఓలు, డీఆర్‌డీఏ పీడీ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలి..

జిల్లాలో కొత్తగా పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సకాలంలో అనుమతులివ్వాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. కలెక్టర్ చాంబర్‌లో డీఐసీసీ కమిటీ సమావేశంలో కలెక్టర్ పరిశ్రమలు, సబ్సిడీపై కమిటీతో చర్చించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ నర్సింహమూర్తి, ఎంవీఐ రవీందర్, ఎల్‌డీఎం రాజు, డీటీసీపీ అధికారి రత్నకుమారి పాల్గొన్నారు.

అంతర్ రాష్ట్ర దొంగ అరెస్టు

- 103 గ్రాముల బంగారం, 824 గ్రాముల వెండి స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ బారి

వరంగల్ క్రైం : తాళం వేసి ఉన్న ఇండ్లలో చోరీలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర దొంగతో పాటు చోరీ సొత్తును కొనుగోలు చేసిన ముగ్గురిని మడికొండ పోలీసులు అరెస్టు చేసినట్లు సెంట్రల్ జోన్ డీసీపీ మహమ్మద్ అబ్దుల్ బారి తెలిపారు. వీరి నుంచి రూ.7 లక్షల విలువైన 103 గ్రాముల బంగారం, 824 గ్రాముల వెండితోపాటు రెండు ఐప్యాడ్లు, రూ.19 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లా సిద్దవుట్ మండలం బాక్రాపేటకు చెందిన పంతగిరి రాజా అదే రాష్ట్రంలో పలు చోరీ కేసుల్లో జైలు శిక్ష అనుభవించి విడుదలయ్యాడు. అనంతరం గత జూన్‌లో కాజీపేటకు వచ్చి తిలక్‌నగర్‌లో నివాసం ఉంటూ రాత్రి సమయాల్లో తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీకి పాల్పడుతున్నాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం మడికొండ, ధర్మసాగర్ మార్గంలో తనిఖీలు నిర్వహిస్తున్న మడికొండ పోలీసులకు అనుమానాస్పదంగా కనిపించడంతో తనిఖీ చేశారు. నిందితుడి వద్ద బంగారం లభించడంతో అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడు. దీంతో అరెస్టు చేశారు. అలాగే, చోరీ సొత్తును కొనుగోలు చేసిన వరంగల్‌కు చెందిన పోలిపాక సందీప్, ఆడెపు రమేష్, కాజీపేటకు చెందిన సాతూరి వెంకటేశ్‌ను అరెస్టు చేసి బంగారం, వెండి, ట్యాబ్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సెంట్రల్ జోన్ డీసీపీ తెలిపారు.

తపాలా శాఖ ద్వారా లెటర్ క్యాంపెయినింగ్

హన్మకొండ: 'డిజిటల్ ఇండియా ఫర్ న్యూ ఇండియా' అనే అంశంపై జాతీయ స్థాయి వ్యాస రచన (లెటర్ క్యాంపెయినింగ్) పోటీ నిర్వహిస్తున్నామని తపాలా హనుమకొండ డివిజన్ సూపరింటెండెంట్ డి.హనుమంతు తెలిపారు. విద్యార్థులు తమ వ్యాసాలను అక్టోబర్ 31వ తేదీలోపు చీఫ్ పోస్టు మాస్టర్ జనరల్, తెలంగాణ సర్కిల్, హైదరాబాద్-500001 చిరునామాకు పంపాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు. 18 సంవత్సరాల లోపు, 18 సంవత్సరాల పైన రెండు కేటగిరీల్లో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఇన్‌ల్యాండ్ లెటర్, ఎన్వలప్‌లో అయితే 500 పదాలకు మించకుండా ఏ-4 సైజ్ కాగితంపై 1000 పదాలకు మించకుండా వ్యాసం రాయాలని సూచించారు. చేతితో రాసిన లేఖలు మాత్రమే ఆమోదిస్తారని తెలిపారు. ఎంబోర్డ్ ఎన్వలప్/ ఎన్వలప్‌కి, ఇన్‌ల్యాండ్ లెటర్‌కు అవసరమైన స్టాంపులు అంటించి పంపాలని సూచించారు. స్టాంప్‌లు అంటించుకుండా పంపినవి పరిగణలోకి తీసుకోరని వివరించారు. తెలంగాణ సర్కిల్‌లో ఫలితాలు డిసెంబర్ 15నాటికి ప్రకటిస్తారని తెలిపారు. సర్కిల్ స్థాయిలో ప్రథమ బహుమతి రూ.25 వేలు, ద్వితీయ బహుమతి రూ.10 వేలు, తృతీయ బహుమతి రూ.5 వేలు, జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి రూ.50 వేలు, ద్వితీయ బహుమతి రూ.25 వేలు, తృతీయ బహుమతి రూ.10 వేలు ఇవ్వనున్నట్లు వివరించారు.

సరైన సమయంలో అభ్యర్థుల ఎంపిక

- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్ రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్

హన్మకొండ: సరైన సమయంలో అభ్యర్థులను ఎంపిక చేసి ప్రకటిస్తామని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి అన్నారు. గురువారం రాత్రి హనుమకొండ హంటర్ రోడ్డులోని వేద బాంక్వెట్ హాల్‌లో బీజేపీ పార్లమెంట్ ప్రవాస్ యోజన వరంగల్ క్లస్టర్ (వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గాలు) సమావేశం జరిగింది. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సహ ఇన్‌చార్జ్ సునీల్ బన్సల్ ముఖ్య అతిథిగా హాజరై దిశానిర్దేశం చేశారు. సమావేశ వివరాలను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి వివరించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకెళ్తున్నామన్నారు. బీఆర్ఎస్ అవినీతి పాలన, హామీల వైఫల్యాన్ని ప్రజల్లో ఎండగడుతామన్నారు. ఎన్నికలు వస్తున్నాయని కొత్త హామీలు ఇస్తూ సీఎం కేసీఆర్ ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. కుటుంబం కోసం పనిచేస్తూ అవినీతికి పాల్పడుతున్న కేసీఆర్‌ను గద్దెదించుతామన్నారు. రైతు సంక్షేమం, పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమం ఎజెండాగా ముందుకెళ్తున్నామన్నారు. ఈనెల 20వ తేదీ నుంచి ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఇతర రాష్ట్రాల బీజేపీ ఎమ్మెల్యేలు పర్యటిస్తారన్నారు. ఎంతోమంది కీలక నాయకులు బీజేపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో జాతీయ కార్యవర్గ సభ్యులు పొంగులేటి సుధాకర్ రెడ్డి, గరికపాటి మోహన్ రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శ్రుతి, రాష్ట్ర కార్యదర్శి ఉమారాణి, హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, మూడు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ రాష్ట్ర పదాధికారులు, జిల్లాల అధ్యక్షులు, ఇన్‌చార్జ్‌లు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న విద్యార్థుల ఆందోళన


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కాశిబుగ్గ: స్టైఫండ్ పెంపు కోసం వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య విద్యార్థులు చేపడుతున్న ఆందోళన కొనసాగుతోంది. హౌస్ సర్జన్లకు స్టైఫండ్ పెంచాలని డిమాండ్ చేస్తూ ఐదు రోజుల నుంచి ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహిస్తున్నారు. ఆరో రోజు గురువారం వైద్యశాల నుంచి పోచమ్మమైదాన్ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. స్టైఫండ్ పెంపు కోసం ఆరు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా ధర్నా చేస్తున్న ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. 2014 సంవత్సరం నుంచి స్టైఫండ్ పెంచలేదన్నారు. దీనిపై ఇప్పటికైనా స్పందించి స్టైఫండ్ పెంచాలని డిమాండ్ చేశారు.

కొనుగోలుదారుడిపై దాడి..

హసన్‌పర్తి: ప్లాట్‌ను ఓ సర్వే నంబర్‌లో రిజిస్ట్రేషన్ చేసి.. మరో చోట చూపించారు. చూపించిన ప్లాట్ సర్వే నంబర్ తప్పుగా తేలడంతో విక్రయదారులను ప్రశ్నించారు. వారు కొనుగోలుదారుడిపై దాడికి దిగారు. ఈ ఘటనపై బాధితుడు కేయూపీఎస్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. హసన్‌పర్తి మండలం భీమారానికి చెందిన మండల రమేష్ అదే గ్రామానికి చెందిన చింతల రాజకొమురయ్య, స్వరూప వద్ద ఇటీవల 2వందల గజాల ప్లాట్ కొనుగోలు చేశాడు. ప్లాట్ వివాదంలో ఉండడంతో కొనుగోలుదారుడు నిలదీశాడు. దీంతో రాజకొమురయ్య, స్వరూప.. బాధితుడిని చితకబాదారు. ఈ ఘటపై బాధితుడి ఫిర్యాదు మేరకు రాజకొమురయ్య, స్వరూపపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

మడికొండ: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. ఈ ఘటన బుధవారం రాత్రి మడికొండ ఔటర్ రింగ్ రోడ్డు పై జరిగింది. హైదరాబాద్ కుత్బుల్లాపూర్‌కు చెందిన కొండవిడి యశ్వంత్, ములుగు జిల్లా వెంకటపూర్ మండలం జవహర్‌నగర్‌కు చెందిన గంప రవికుమార్, భూపాలపల్లి జిల్లా మహాముత్తారానికి చెందిన చాట్ల పల్లవి హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగాలు చేస్తున్నారు. ఈ క్రమంలో ద్విచక్రవాహనంపై హైదరాబాద్ నుంచి జవహర్ నగర్‌కు వెళ్తున్నారు. మార్గమధ్యలో మడికొండ శివారు టేకులగూడెం మామిడితోట వద్ద గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు క్రాస్ చేస్తుండగా వాహనం అదుపుతప్పి అతడిని ఢీకొంది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందగా, ద్విచక్రవాహనంపై ఉన్న యశ్వత్ (22), రవికుమార్, పల్లవికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే 108లో ఎంజీఎం తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం యశ్వంత్ మృతి చెందారు. ఈ ఘటనపై రవికుమార్ తండ్రి సమ్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మడికొండ సీఐ వేణు తెలిపారు.

16 నుంచి కుష్టు నిర్ధారణ పరీక్షలు

- వరంగల్ డీఎంహెచ్ఓ వెంకటరమణ


మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ వెంకటరమణ

గీసుకొండ : వరంగల్ జిల్లాలో ఈ నెల 16 నుంచి 31 వరకు కుష్టు నిర్ధారణ కోసం వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ కె.వెంకటరమణ సూచించారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో పీహెచ్‌సీల నోడల్ పర్సన్లకు కుష్టు వ్యాధిపై గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రారంభ దశలోనే వ్యాధిని గుర్తించి తగిన చికిత్స అందించాలన్నారు. జిల్లాలో 6 పీబీ కేసులు, ఎంబీ కేసులు 36 ఉన్నాయన్నారు. ఇంటింటి సర్వే బ్యానర్లు, కరపత్రాలను డీఎంహెచ్ఓ పంపిణీ చేశారు. ఫిజియోథెరపిస్టు నర్సింహారెడ్డి, డీపీఎంఓ అనుపమ, డిప్యూటీ డెమో అనిల్‌కుమార్, నవీన్, రాజ్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌బీఎస్‌కే ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

గీసుకొండ : వైద్య, ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న తమను రెగ్యులర్ చేయాలని ఆర్‌బీఎస్‌కే మెడికల్ ఆఫీసర్ ఉద్యోగులు కోరారు. ఈ మేరకు గురువారం మెడికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డీఎంహెచ్ఓను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కారుణ్య నియామకాలు చేపట్టాలని, హెల్త్ ఇన్సూరెన్స్, ఎరియర్స్, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సూచించారు. అసోసియేషన్ నాయకులు గుండా రవీందర్, దుర్గా ప్రసాద్, కుమార్, అనిల్, శ్రీనివాస్, శివ పాల్గొన్నారు.

విలేజీ బస్ ఆఫీసర్లు వారధిగా పనిచేయాలి

- ఆర్టీసీ వరంగల్ ఆర్ఎం శ్రీలత


మాట్లాడుతున్న ఆర్టీసీ ఆర్ఎం శ్రీలత

హన్మకొండ: ప్రయాణికులు, సంస్థకు విలేజీ బస్ ఆఫీసర్లు వారధిగా పని చేయాలని టీఎస్ ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ జాస్తి శ్రీలత అన్నారు. గురువారం వరంగల్ ములుగు రోడ్డులోని ఆర్టీసీ జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీలో విలేజీ బస్ ఆఫీసర్ల శిక్షణ నిర్వహించారు. వరంగల్ రీజియన్‌లోని 9 డిపోలకు చెందిన 52 మంది విలేజీ బస్ ఆఫీసర్లు పాల్గొన్నారు. ఈ శిక్షణను ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడుతూ సంస్థకు ప్రయాణికుడు అతి ముఖ్యమైన వ్యక్తి అన్నారు. విలేజీ బస్ ఆఫీసర్లు గ్రామాలకు వెళ్లి ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేలా ప్రజలను చైతన్యం చేయాలన్నారు. ఆర్టీసీకి సంబంధించిన వివిధ రకాల మార్కెటింగ్ స్కీంలు, బస్ పాస్‌ల రాయితీలు, ప్రత్యేక బస్సుల బుకింగ్ వంటి వివిధ సదుపాయాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంలు బి.కృపాకర్ రెడ్డి, జి.మాధవరావు, ప్రిన్సిపాల్ వంగాల మోహన్ రావు, వ్యక్తిత్వ వికాస నిపుణుడు విష్ణుకుమార్ పాల్గొన్నారు.